ఈనాడు మహబూబ్‌నగర్

బుధవారం సెప్టెంబరు 25, 2024 5

ఆరేళ్ల తర్వాత జలకళ



వర్షపు నీటితో నిండుకుండలా కొత్తచెరువు

పాలమూరు పట్టణ ప్రజలతో తాగునీటి అనుబంధమున్న కొత్తచెరువుకు మళ్లీ జలకళ వచ్చింది. ఆరేళ్ల తర్వాత అలుగు పారింది. ఇటీవలి వర్షాలకు చెరువులోకి భారీగా వరద నీరు చేరింది. చెరువు నిండేలోగా వర్షాలు ఆగిపోవటంతో అలుగు పారలేదు. చాలా రోజుల తర్వాత భారీ వర్షంతో కొత్త చెరువులోకి పైభాగాన ఉన్న అటవీ ప్రాంతం నుంచి భారీగా నీరు చేరింది. కొత్తచెరువు అలుగు పారి పట్టణ ప్రజలకు కనువిందు చేస్తోంది. 2018లో ఒక పర్యాయం కొత్త చెరువు నిండి ఐదు రోజుల పాటు అలుగు పారింది. సమీపంలోని కొత్తగంజ్, సంజయ్‌నగర్, బోయపల్లిగేట్, హనుమాన్‌నగర్, మడుగుకాలనీ, సింహగిరి ప్రాంతాల జనం కుటుంబ సమేతంగా కొత్త చెరువుకు చేరుకుని పర్యటక అనుభూతి పొందారు. కొత్త చెరువు కింద 76.25 ఎకరాల ఆయకట్టు ఉండేది. కాలక్రమేణ అనేక కాలనీలు ఏర్పాటు కావటంతో ఆయకట్టు 35 ఎకరాలకు పడిపోయింది. ఒకప్పుడు ఈ కొత్తచెరువు నీరే పాలమూరు పట్టణ ప్రజల దాహార్తి తీర్చింది. ఇప్పటికీ కొత్త చెరువు కింది భాగంలో తాగునీటి సంపులు, ఫిల్టర్ బెడ్లు శిథిలావస్థకు చేరి కనిపిస్తాయి.

- న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం

ఉదండాపూర్ పునరావాసానికి రూ.45.కోట్లు

నిర్వాసితుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.16లక్షల చొప్పున జమ


న్యూస్‌టుడే, జడ్చర్ల : కొన్ని నెలలుగా నిర్వాసితులు ఎదురుచూస్తున్న ఆర్అండ్ఆర్ ప్యాకేజీ నిధులు ప్రభుత్వం రూ. 45,59,59,130 నిధులు విడుదల చేసింది. నాలుగు గిరిజన తండాల్లోని ఒక్కో నిర్వాసితుడి బ్యాంకు ఖాతాల్లో రూ. 16,30,249 చొప్పున ప్యాకేజీ జమ చేసింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయగా కలెక్టర్ విజయేందిర బోయి ధ్రువీకరించారు. ఖాతాల్లో పరిహారం డబ్బులు జమైనట్లు సంక్షిప్త సమాచారం రావటంతో నిర్వాసితుల్లో ఆనందం నెలకొంది. ఉమ్మడి జిల్లాలో పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల పరిశీలనకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు తదితరులు బుధవారం పర్యటించనున్నారని కలెక్టర్ తెలిపారు. మొదటగా జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్ జలాశయం వద్ద పనులను మంత్రులు పరిశీలించనున్నారు. ఇందుకు కిష్టారం సమీపంలో హెలిప్యాడ్ ఏర్పాటు పనులను అధికారులు చేపట్టారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ ఆదిరెడ్డి బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. మంత్రుల రాక సందర్భంగా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ నిధులు విడుదల చేయడం నిర్వాసితులకు ఊరటనిస్తున్న అంశం. ఇటీవల జలాశయం పనులు చేపట్టేందుకు గుత్తేదారులు సన్నాహాలు చేయగా నిర్వాసితులు అడ్డుకున్నారు. పునరావాసం, పరిహారం డబ్బులు చెల్లించాకే పనులు చేపట్టాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉదండాపూర్ జలాశయం కోసం భూసేకరణ చేసిన సుమారు 4వేల ఎకరాల భూమికి సంబంధించి రైతులకు పరిహారం విడుదల చేశారు. గత ప్రభుత్వం ప్రకటించిన రూ. 12లక్షల ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, ముంపు గ్రామాల్లో బాధితులు కోల్పోతున్న స్థిరాస్తులు ఇళ్లు, ఇళ్ల స్థలాలకు సంబంధించిన సర్వే పూర్తిచేసినా నిధులు విడుదల కాలేదు. పునరావాస కాలనీ ఏర్పాటు ప్రక్రియ అర్ధాంతరంగా ఆగిపోయింది. గత శాసనసభ ఎన్నికల తర్వాత ఈ ప్రక్రియ చేపడతామని అప్పటి ఎమ్మెల్యే డా.లక్ష్మారెడ్డి ప్రకటించినా ప్రభుత్వం మారడంతో పాటు ఆయన ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఈ విషయంపై అసెంబ్లీలో చర్చించారు. బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు కూడా ప్రత్యేకంగా కోరారు. స్పందించిన ముఖ్యమంత్రి నిధుల మంజూరు చేశారు. మొదటి విడతగా 4 తండాల నిర్వాసితుల ఖాతాల్లో జమచేశారు. వల్లూరు, ఉదండాపూర్ నిర్వాసితులకు కూడా నిధులు మంజూరయ్యాయని, లబ్ధిదారులుగా దాదాపు 300 మంది అనర్హుల పేర్లను చేర్చినట్లు ప్రభుత్వం గుర్తించిందని, మరో మారు సర్వే చేశాక అర్హుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. జాతీయ రహదారి-44 సమీపంలో దేవునిగుట్టతండా సమీపంలో నిర్మిస్తున్న పునరావాస కాలనీలో నీరు, ఇతర వసతుల ఏర్పాటు పనులకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. మొదటి విడతగా 150 మంది నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామన్నారు.



తండావాసుల ఖాతాలో జమ చేసిన పరిహారం డబ్బుల సంక్షిప్త సమాచారం

వేగానికి కళ్లెమేదీ?

జాతీయ రహదారి-44పై తగ్గని ప్రమాదాలు



జాతీయ రహదారి-44పై స్పీడ్‌గన్‌తో వాహన వేగాన్ని పరిశీలిస్తున్న అధికారి

న్యూస్‌టుడే, భూత్పూర్, పాలమూరు

జాతీయ రహదారి-44పై ప్రమాదాలతో నిత్యం ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. వాహనదారులు అతివేగంగా దూసుకెళ్లటం, కూడళ్లు, మలుపుల వద్ద వాహన వేగాన్ని నియంత్రించలేకపోవడమే ఈ ప్రమాదాలకు కారణమవుతోంది. స్పీడ్‌గన్‌తో వేగంగా వెళ్తున్న వాహనాలను గుర్తించి జరిమానాలు విధించటం మహబూబ్‌నగర్ జిల్లాకే పరిమితమవుతోంది. ఫలితంగా వాహనాల వేగానికి కళ్లెం పడక రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గటం లేదు. జాతీయ రహదారి-44పై నెలకొన్న పరిస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం.

మహబూబ్‌నగర్‌లోనే స్పీడ్‌గన్ : ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు అతివేగంగా వెళ్లే వాహనాలను గుర్తించేందుకు స్పీడ్‌గన్ వాహనాలు అందించాలని నిర్ణయించారు. రాష్ట్ర విభజన తర్వాత ఉమ్మడి జిల్లాకు ఒక వాహనాన్ని కేటాయించారు. ఆ సమయంలో కొత్తూరు నుంచి మానవపాడు మండలంలోని పుల్లూరు వరకు వాహనం తిరుగుతూ వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. జిల్లాల విభజన తర్వాత స్పీడ్‌గన్ వాహనం మహబూబ్‌నగర్‌కే కేటాయించటంతో ఈ జిల్లా పరిధిలోనే వినియోగిస్తున్నారు. వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలో కెమెరాలతోనే పోలీసులు వాహన వేగాన్ని గుర్తించి, జరిమానా విధిస్తున్నారు. వాహనం ఒకటే కావటం, ఒకే జిల్లాకు పరిమితవటంతో వాహనదారుల్లో జరిమానాల భయం లేకుండా పోయింది. మరిన్ని వాహనాలు కేటాయించాల్సిన అవసరముంది.

ఏడాదికి 40వేల పైనే.. : మహబూబ్‌నగర్ జిల్లాలో జాతీయ రహదారిపై రోజూ ఒకటి, రెండు ఠాణాల పరిధిలో స్పీడ్‌గన్ వాహనం వినియోగిస్తున్నారు. 2023లో అతివేగంగా వెళ్లిన 40,298 వాహనాలను గుర్తించి రూ. 1,035 చొప్పున జరిమానా విధించారు. 2024లో ఆగస్టు వరకు 20,200 వాహనాలకు జరిమానా విధించారు. వేగంగా వెళ్తున్న వాటిలో కార్లు, ప్రైవేటు బస్సులే ఎక్కువ ఉంటున్నాయి.

పరిమితికి మించి..

బాలానగర్, రాజాపూర్, జడ్చర్ల, భూత్పూర్, మూసాపేట, అడ్డాకుల, కొత్తకోట, పెబ్బేరు, ఇటిక్యాల, ఉండవల్లి (పుల్లూరు) మండలాల మీదుగా జాతీయ రహదారి-44 వెళ్తోంది. రహదారిపై 80 కి.మీ.లు, కూడళ్లు, మలుపుల వద్ద 40 నుంచి 60 కి.మీ.ల మధ్య వేగంతోనే వాహనాలు వెళ్లాలి. గతేడాది ఈ రోడ్డుపై మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 85 ప్రమాదాలు చోటుచేసుకుంటే 35 మంది మృతిచెందారు. 463 మంది గాయపడ్డారు.

అటకెక్కిన తనిఖీలు....: గతంలో ఎంవీఐలు, ఏఎంవీఐలు నిత్యం రహదారులపై తనిఖీలు నిర్వహించేవారు. కొన్నేళ్ల నుంచి ఎంవీఐ కింద ఏఎంవీఐలు ఉండకపోవటంతో తనిఖీలు జరగడం లేదు. మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ తదితర ప్రాంతాల్లో ఆర్టీఏ కార్యాలయాలు ఉన్నాయి. పెబ్బేరు, కల్వకుర్తిలో ప్రాంతీయ కార్యాలయాలు ఉన్నాయి. తగినంత మంది ఏఎంవీఐలు లేక జాతీయ రహదారులపై తనిఖీలు ఉండటం లేదు. పోలీస్, ఎన్‌హెచ్ఏఐ, ఆర్టీఏ శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే ఫలితాలు వస్తాయి.



సంయుక్త తనిఖీలు చేపడతాం : వాహనదారులు 80 కి.మీ.ల వేగంతో వెళ్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. జాతీయ రహదారులపై ప్రమాదాలను నివారించడానికి అనుబంధ శాఖలతో కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తాం. మొదట ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి వాహనాల వేగాన్ని నియంత్రించడానికి స్పీడ్ గన్ వినియోగిస్తాం.

- డి.జానకి, జిల్లా ఎస్పీ, మహబూబ్‌నగర్

దరిచేరని ఆరోగ్య లక్ష్మి

అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనానికి అంతంతే స్పందన

ఈనాడు పరిశీలన



నవాబుపేట అంగన్‌వాడీ కేంద్రంలో 9 మంది లబ్ధిదారులు ఉండగా భోజనానికి వచ్చింది ముగ్గురే

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం : పుట్టబోయే బిడ్డ తగిన బరువుతో ఆరోగ్యంగా ఉండాలని, బాలింతలకు తగిన పోషకాహారం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆరోగ్య లక్ష్మి' పథకం లక్ష్యానికి పూర్తిగా దూరమైంది. ఈ పథకం అమలుపై స్త్రీశిశు సంక్షేమ శాఖ చెబుతున్న లెక్కలకు క్షేత్రస్థాయి పరిస్థితికి ఎలాంటి పొంతన ఉండటం లేదు. పల్లెలు, పట్టణాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు వాటి పరిధిలోని బాలింతలు, గర్భిణులు మధ్యాహ్నం భోజనం చేసేందుకు రావాలి. 80 నుంచి 90 శాతం మంది లబ్ధిదారులు రావటం లేదు.

పెరిగిన సమస్యాత్మక ప్రసవాలు : ఆరోగ్య లక్ష్మి పథకం కింద మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకు, పుట్టిన శిశువుకు ఆరు నెలలు నిండే వరకు తల్లి(బాలింత)కి అన్నం, పప్పు, చారు, ఉడకబెట్టిన గుడ్డు అందిస్తారు. లాక్‌డౌన్ సమయంలో, అంతకు ముందు ఇంటి వద్దే వండుకుని తినమని గర్భిణులు, బాలింతలకు పప్పు, నూనె, గుడ్లు, పోషక విలువలతో కూడిన బియ్యాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసేవారు. దాదాపు మూడేళ్ల ఇలా అమలు కాగా అందరూ సరకులు తీసుకునేవారు. 2021 సెప్టెంబరు నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకే వచ్చి భోజనం చేయమని ఆదేశాలు రావడంతో అప్పటి నుంచి భోజనానికి వచ్చేవారి సంఖ్య పూర్తిగా పడిపోయింది. రోజూ కూలీనాలీ చేస్తే తప్ప పూట గడవని కుటుంబాలే అధికంగా ఉండటం, దూరంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు గర్భిణులు, బాలింతలు నడుచుకుంటూ వెళ్లే పరిస్థితి లేకపోవటమే ఇందుకు కారణం. పల్లెల్లో గర్భిణులు, బాలింతలు వ్యవసాయం, కూలీ పనులకు వెళ్తుంటారు. వారు మధ్యాహ్నం కేంద్రాలకు రాలేని పరిస్థితి. పట్టణాల్లో రకరకాల పనులు చేసుకునే పేదలు, మధ్య తరగతి వాళ్లు అంగన్‌వాడీ కేంద్రాలకు రావటం లేదు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో చాలా మంది శిశువులు తక్కువ బరువుతోనే జన్మిస్తున్నారు. గర్భిణులు రక్తహీనతతో బాధపడటం వల్ల ప్రసవం సమస్యాత్మకం(హైరిస్క్)గా మారుతోంది. తక్కువ బరువుతో జన్మించిన నవజాత శిశువులకు చికిత్సలు చేయించేందుకు కుటుంబాలు రూ. వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. కొందరు గర్భిణులు ప్రాణాలు కూడా కోల్పోతున్నారు.

తప్పుడు లెక్కలతో సరకులు పక్కదారి..



అంగన్‌వాడీ కేంద్రాల్లో 8 నుంచి 10 మంది వరకు గర్భిణులు, బాలింతలు ఉంటున్నారు. ఒకరిద్దరు కూడా భోజనానికి రావటం లేదు. మహబూబ్‌నగర్ జిల్లాలో 13,202 మంది లబ్ధిదారులకు ఉంటే అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి 10,865 మంది (82 శాతం) భోజనం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. నాగర్‌కర్నూల్‌లో 13,151 మందికి గాను 9,353 మంది (71శాతం), వనపర్తిలో 9,421 మందికి గాను 5,439 (57శాతం), జోగులాంబ గద్వాలలో 11,102 మందికి గాను 8,790 (79శాతం), నారాయణపేట జిల్లాలో 12,280 మందికి గాను 8,928 మంది (72 శాతం) భోజనం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ లెక్కలు పచ్చి అబద్ధమని ఏ కేంద్రానికి వెళ్లి పరిశీలించినా, లబ్ధిదారులను అడిగినా తెలిపోతుంది. లబ్ధిదారులు రాక వారి కోసం కేంద్రానికి వచ్చే సరకులు పక్కదారి పడుతున్నాయి. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల వాళ్లు రేషన్ దుకాణంలోనే బియ్యం అమ్మేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారి జరీనా బేగంని 'న్యూస్‌టుడే' సంప్రదించగా గర్భిణులు, బాలింతలందరూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి భోజనం చేసేలా టీచర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు నిత్యం తనిఖీలు చేస్తూ పరిస్థితిని చక్కదిద్దితేనే పథకం లక్ష్యం నెరవేరే అవకాశముంది.

జల్లంత.. తుళ్లింత!



వర్షాలతో ప్రకృతి ఆహ్లాదకరంగా మారడంతో మయూరాల సందడి పెరిగింది. మంగళవారం ఉదయం భూత్పూర్ మండలం కొత్తమొల్గర శివారులో మూడు నెమళ్లు ఇలా హద్దురాళ్లపై ఒళ్లు విరుచుకుంటూ కనిపించగా 'ఈనాడు' క్లిక్ మనిపించింది.

- ఈనాడు, మహబూబ్‌నగర్

సమస్యలు పరిష్కరించాకే పనులు ప్రారంభించండి



నిర్వాసితులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, తహసీల్దారు

జడ్చర్ల, న్యూస్‌టుడే : ముందు తమ సమస్యలు పరిష్కరించాకే జలాశయం పనులను ప్రారంభించాలని ఉదండాపూర్ జలాశయం ముంపు గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. జడ్చర్ల ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం నిర్వాసితులతో డీఎస్పీ వెంకటేశ్వర్లు, తహసీల్దారు బ్రహ్మంగౌడ్, నీటి పారుదల శాఖ ఈఈ సురేశ్, డీఈ నారాయణ సమావేశమై పలు అంశాలు చర్చించారు. ఉదండాపూర్ జలాశయానికి బుధవారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇతర మంత్రులు, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి రానున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ గతంలో తమకు అన్యాయం జరిగిందని, ఇప్పుడు 18 ఏళ్లు నిండిన వారికి కూడా ప్యాకేజీ వర్తింపజేయాలని కోరారు. పునరావాస కాలనీలో పనులు పూర్తి చేయాలని కోరారు. మంత్రుల పర్యటన సమస్యల పరిష్కారం కోసమేనని, ఎవరు ఇబ్బందులు సృష్టించవద్దని డీఎస్పీ కోరారు. అంతకు ముందు పోలీస్‌స్టేషన్‌లోనూ గ్రామస్థులతో చర్చించారు.

28లోగా ఓటరు జాబితా ఇంటింటి సర్వే పూర్తి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్: ఓటరు జాబితా పరిశీలనలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే పక్కాగా చేపట్టాలని, ఈనెల 28లోగా ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ, పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్షించారు. ఎన్నికల నియమ నిబంధనల మేరకు ఫారం - 6,7,8లను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఫొటో ఓటరు గుర్తింపు కార్డులను అప్‌డేట్ చేయాలన్నారు. బీఎల్వోలు వంద శాతం పోలింగ్ కేంద్రాలను, లొకేషన్లను పరిశీలించి ఫొటోలతో సహా అప్లోడ్ చేయాలని ఆదేశించారు. పట్టభద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈనెల 30న పబ్లిక్ నోటీసు జారీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. జిల్లా నుంచి కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఎస్.మోహన్ రావు, ఆర్డీవో నవీన్ పాల్గొన్నారు.

ఫ్లాష్.. ఫ్లాష్.. ఫ్లాష్..

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం



వెంకటేశ్‌గౌడ్

జడ్చర్ల, రాజాపూర్: జాతీయ రహదారి-44పై రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. రాజాపూర్ మండలం చొక్కంపేట గ్రామానికి చెందిన వెంకటేశ్‌గౌడ్(25) ద్విచక్రవాహనంపై జడ్చర్ల వైపు వస్తుండగా లారీ ఢీకొని అక్కడికక్కడే మృతిచెందినట్లు కానిస్టేబుల్ ఆనంద్ తెలిపారు. మృతదేహాన్ని జడ్చర్ల ఆసుపత్రికి తరలించారు.

పోరాటాల చరిత్ర పీడీఎస్‌యూ సొంతం



భారీ ర్యాలీ నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

పాలమూరు, న్యూస్‌టుడే : పీడీఎస్‌యూ చరిత్రంతా పోరాటాలమయమని, విద్యార్థి చైతన్యంలో కీలకపాత్ర పోషించే సంఘం తమదేనని సంఘం ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు కాలేశ్వర్ తెలిపారు. ఈ మేరకు మహబూబ్‌నగర్‌లో పీడీఎస్‌యూ సంఘం ఆవిర్భవించి 50 ఏళ్లు అవుతున్న సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపకార వేతనాలు, బోధన రుసుములు పెంచాలని, విద్యార్థులకు ఉచితంగా బసు పాసులను ఇవ్వాలని, బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు. పాలిటెక్నిక్ వృత్తి విద్య కోర్సులను సులభతరం ఉండాలని, పరీక్ష ఫీజులను తగ్గించాలని, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించాలనే డిమాండ్ చేశారు. నేతలు మారుతి, రామచందర్, రాము, వెంకటేశ్వర్‌రెడ్డి, దేవేందర్, అంబదాస్, రాము, గణేశ్, వెంకటేశ్, చంద్రాములు, సీతారాములు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పనులు పరుగు పెట్టేనా!

పాలమూరులో నేడు మంత్రుల పర్యటన



పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పరిధిలోని నార్లపూర్ పంపుహౌజ్ ప్రాంతం

ఈనాడు, మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పనులను పరుగు పెట్టించడానికి ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. జులైలో సీఎం రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్‌లో పాలమూరు ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. నిర్మిత ప్రాజెక్టులను వచ్చే ఏడాది డిసెంబరు చివరినాటికి పూర్తి చేయాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. సమీక్ష జరిగి రెండు నెలలైనా అనుకున్న పురోగతి మాత్రం లేదు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతోపాటు నిర్మిత ప్రాజెక్టుల పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఈ ప్రాజెక్టులకు బడ్జెట్‌లో రూ. 2,792.6 కోట్లు కేటాయించినా పనులు ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో పనుల పరిశీలన, పురోగతిపై సమీక్ష కోసం బుధవారం నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పర్యటిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఎటూ తేలని వైనం..: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులపై అధికారుల్లోనూ సందిగ్ధత నెలకొంది. ఈ పనుల కొనసాగింపుపై ప్రభుత్వం నుంచి సరైన దిశానిర్దేశం లేకపోవడంతో మిగిలిన వాటిపై ప్రభావం పడుతోంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి వరదనీరు వచ్చినా నీటిని ఎత్తిపోసే పరిస్థితి లేదు. ఇప్పటికే నార్లపూర్, ఏదుల, వట్టెం పంపుహౌస్‌ల్లో నాలుగు పంపుల చొప్పున పనులు పూర్తి చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి వట్టెం పంపుహౌస్‌లోకి వరదనీరు వచ్చి చేరింది. ఈ నీటిని తోడేందుకు కనీసం రెండు నెలలు పట్టే అవకాశం ఉంది. నార్లపూర్ నుంచి ఏదుల వరకు అర కిలోమీటర్ మేర కాలువ పనులు పూర్తి కాలేదు. ఉదండాపూర్‌లో పంపుహౌస్ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఈ ప్రాజెక్టు రెండో దశలో టెండర్లు పూర్తయిన కాలువ పనులను ప్రస్తుతానికి పక్కన పెట్టారు.

నిర్మిత ప్రాజెక్టులపై..: ఉమ్మడి జిల్లాలోని కల్వకుర్తి, కోయిలసాగర్, భీమా, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాల ద్వారా 6.39 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందుతోంది. అదనపు ఆయకట్టు పనులు పూర్తయితే మొత్తం 8.80 లక్షల ఎకరాలకు సాగునీరందే పరిస్థితి ఉంది. ఈ పనులు పూర్తి చేయడానికి గత బడ్జెట్‌లో రూ. 1,469 కోట్లు కేటాయించారు. కాలువల నిర్మాణం, పునరావాస చర్యలు, భూసేకరణ వంటివి చేయాలి. ప్రస్తుతం భారీ వర్షాలకు జలాశయాలు నిండటం, కాలువల్లో నీరు పారుతుండటంతో అదనపు ఆయకట్టు పనులపై ప్రభావం చూపనుంది. కొత్తకోటలోని కానాయపల్లి వద్ద శంకరసముద్రం జలాశయం పరిధిలో ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో భాగంగా పునరావాస ప్రక్రియ ముందుకు సాగడం లేదు. దీనికి పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది. గద్వాల జిల్లాలోని గట్టు ఎత్తిపోతల పథకంలో భాగంగా ర్యాలంపాడు నుంచి నీటిని తరలించాలని భావించినా దీని డిజైను మార్చాలన్న చర్చ జరిగింది. జూరాల జలాశయం పరిధిలోని బ్యాక్‌వాటర్ ముంపు గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పరిధిలోని రెండోదశ పనులపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

మంత్రుల పర్యటన ఇలా..

- **ఉదయం 10:15 :** జడ్చర్లలోని ఉదండాపూర్ జలాశయం పనుల పరిశీలన
- **ఉదయం 11:15 :** గట్టు ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన
- **మధ్యాహ్నం 1:00 :** కొత్తకోట మండలంలోని శంకరసముద్రం జలాశయం పరిశీలన
- **మధ్యాహ్నం 3:00 :** పీఆర్ఎల్ఐలో భాగంగా నార్లపూర్ జలాశయం పనుల పరిశీలన
- **సాయంత్రం 4:30 :** వట్టెం రాక జలాశయం పనుల పరిశీలన
- **సాయంత్రం 5:15 :** నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష

సమస్యలు పట్టవంటా!




ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం శుచిగా ఉండటమే కాదు.. పరిసరాలు కూడా శుభ్రంగా ఉండాలి. చాలా ప్రభుత్వ పాఠశాలల్లో వంటగదులు అధ్వానంగా ఉన్నాయి. కొన్నింటికి పైకప్పు కూడా లేదు. అపరిశుభ్ర వాతావరణంలో వంట చేస్తుండటం విద్యార్థుల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తోంది. ఏళ్లుగా ఈ సమస్యలు ఉన్నా విద్యాశాఖ అధికారులు దృష్టి సారించడం లేదు. మహబూబ్‌నగర్ పురపాలిక పరిధి పాలకొండలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో అసంపూర్తి పైకప్పు ఉన్న రేకుల షెడ్డులో వంట చేస్తున్న దృశ్యమిది.
- ఈనాడు, మహబూబ్‌నగర్

మన లడ్డూలు అంతంతే..!




పెద్దకొత్తపల్లి మండలం నాయినోనిపల్లి మైసమ్మ ఆలయం

కొల్లాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్‌లోని ప్రఖ్యాత తిరుమల తిరుపతి లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యి నాణ్యతపై భక్తుల్లో తీవ్ర ఆవేదన వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రధాన ఆలయాల్లో లడ్డూ ప్రసాదంపై ఆసక్తి నెలకొంది. ఆలయాల్లోని లడ్డూ ప్రసాద నాణ్యత ఎవరూ పట్టించుకున్న దాఖలా లేదు. తక్కువ ధరకు టెండర్లు నిర్వహించడంతో, లడ్డూ రూ.15కే విక్రయించాలని నిర్ణయించడంతో తయారీలో నెయ్యి వాడే పరిస్థితి లేక కేవలం శుద్ధి చేసిన (రిఫైండ్) వంట నూనె మాత్రమే వినియోగిస్తూ లడ్డూలు తయారు చేస్తున్నారు. దీంతో లడ్డూ నాణ్యత ఉండకపోగా.. పైగా అనారోగ్యం పాలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉండనున్నాయి. కొవ్వు సంబంధిత ఆయిల్ వినియోగిస్తే దగ్గు, ఉబ్బసం తదితర రోగాలు దరిచేరే అవకాశం ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో.. : ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 48 ప్రధాన ఆలయాలున్నాయి. దేవాదాయశాఖ వీటిని 6ఎ, 6బి, 6సి కేటగిరీలుగా విభజించింది. ఎక్కువ ఆదాయం, ప్రాముఖ్యం పొందిన ఆలయాలను 6ఎలో చేర్చారు. మన్యంకొండ వేంకటేశ్వరాలయం, జోగులాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయం, జమ్ములమ్మ ఆలయం, మక్తల్ వేంకటేశ్వరాలయం, కాకర్లపాడ మైసమ్మఆలయం, గంగాపురం లక్ష్మి చెన్నకేశవాలయం, ఊర్కొండపేట ఆంజనేయస్వామి ఆలయం, రంగాపూర్ ఉమామహేశ్వరాలయం, మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి ఆలయం, సిరసన గండ్ల సీతారామాలయం, నాయినోనిపల్లి మైసమ్మ ఆలయం, అమ్మాపూర్ కురుమూర్తి ఆలయం, సింగోటం లక్ష్మీనర్సింహాలయం, తిమ్మారెడ్డిపల్లి గురులోక మాసందప్రభు మందిరం, వనపర్తి, కొత్తకోట, శ్రీరంగాపూర్‌లోని వనపర్తిరాజావారికి సంబంధించిన గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఉన్నాయి.

కొన్నిచోట్ల గుడిలోనే..

ఆలయాల ప్రసాదాల తయారీలో ముఖ్యంగా లడ్డూ తయారీ కేవలం కొన్ని ఆలయాల్లో స్వయంగా తయారుచేస్తున్నారు. వీటిలో మన్యం కొండ, జోగులాంబ, మద్దిమడుగు, బీచుపల్లి, ఉమామహేశ్వరం ఆలయాల్లో మాత్రం లడ్డూల తయారీ ఉంటోంది. మిగతా అన్ని దేవాలయాల్లో టెండర్ల ద్వారా మాత్రమే లడ్డూ ప్రసాదం విక్రయాలు చేస్తున్నారు. ఇందులో ఒక్క బీచుపల్లి ఆలయంలో మాత్రమే లడ్డూల తయారీలో నెయ్యి వినియోగిస్తున్నట్లు ధరల విశేషం.

6బి జాబితాలో..

మక్తల్ పడమటి ఆంజనేయస్వామి ఆలయం, గూడెబల్లూర్ వేంకటేశ్వరాలయం, చిన్నరాజమూరు ఆంజనేయస్వామి ఆలయం, చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయం, కందూరు రామలింగేశ్వర ఆలయం, వేంకటేశ్వర ఆలయం వనపర్తి ఉండగా, గ్రూప్ 6సిలో బుద్ధారం గండిఆంజనేయస్వామి ఆలయం, మావిళ్లపల్లి లక్ష్మీనర్సింహాలయం ఉన్నాయి.

ప్రసాదం నాణ్యతకు ప్రాధాన్యం..

ఆలయాల్లో లడ్డూ ప్రసాదం తయారీలో నాణ్యత ఉండేలా గుత్తేదార్లపై ఒత్తిడి తెస్తున్నాం. రిఫైండ్ ఆయిల్ వినియోగించి లడ్డూలు తయారుచేస్తున్నారు. లడ్డూ నాణ్యతపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం.
- మదనేశ్వర్‌రెడ్డి, సహాయ కమిషనర్, దేవాదాయశాఖ, ఉమ్మడి మహబూబ్‌నగర్

నాణ్యత ఎంత..

ఆలయాల్లో లడ్డూ ప్రసాదం భక్తులకు అందించేందుకుగాను టెండర్లు పిలుస్తున్నారు. ఒక లడ్డూ ధర కేవలం రూ.15 మాత్రమే నిర్ణయించడంతో ఉమ్మడి జిల్లా అంతటా లడ్డూ తయారీలో పేరున్న కంపెనీ నూనె వినియోగిస్తున్నారు. కేవలం 75 గ్రాముల నుంచి 80 గ్రాముల బరువు ఉండేలా లడ్డూ తయారీలో కేవలం రిఫైండ్ వినియోగించాలన్న నిబంధన ఏదీ టెండర్లలో పేర్కొనకపోవడంతో లడ్డూల నాణ్యతలోనే నూనె వినియోగించి తయారుచేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. తక్కువ ధరలో లడ్డూల విక్రయాలకు అధికారులు గల నెయ్యి ఎలా సమకూర్చాలన్న కారణంతో గుత్తేదారు నూనె వినియోగిస్తున్నారు. లడ్డూ నాణ్యతపై అక్కడక్కడ చిన్నచిన్న ఫిర్యాదులు వచ్చినా.. ఆయా చోట్ల దేవాదాయ శాఖాధికారులు స్పందించి చర్యలు చేపడుతున్నారు. ఆలయాల వద్ద లడ్డూ విక్రయాలు భక్తుల రాకపోకలు సాగించే చోట అపరిశుభ్ర వాతావరణంలో చేపడుతుండటంతో భక్తులు అనారోగ్యాలకు గురయ్యేప్రమాదం ఉంది.

విద్యుత్తు అధికారుల గొడవ.. విచారణకు ఆదేశం

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ట్రాన్స్‌కో ఓల్డ్ పవర్‌హౌస్‌లో ఏఈ, లైన్‌మెన్ ఘర్షణ పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని విద్యుత్ నియంత్రిక చుట్టూ ముళ్ల పొదలు, చెత్తాచెదారం తొలగించేందుకు అదనపు సిబ్బందిని పురమాయించే విషయంలో ఏఈకి, లైన్‌మెన్‌కు మధ్య మాటామాటా పెరిగి కొట్టుకునే వరకు వెళ్లినట్లు సమాచారం. ఆదివారం సాయంత్రం సంఘటన జరగగా విషయం బయటకు పొక్కకుండా అధికార వర్గాలు జాగ్రత్త పడ్డాయి. మధ్యలో దెబ్బలు తిన్న ఏఈ, మరో లైన్‌మెన్‌తో కలిసి ద్విచక్రవాహనంపై రెండో పట్టణ ఠాణాకు చేరుకుని అదేరోజు ఫిర్యాదు చేసినా కేసు నమోదు కాలేదు. మరుసటి రోజు ఏఈకి మద్దతుగా డిప్లొమా ఇంజినీర్ అసోసియేషన్, లైన్‌మెన్‌కు మద్దతుగా 1104 ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఎస్‌ఈకి, డీఈకి ఫిర్యాదు చేశారు. జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వాలని ఎస్‌ఈ పీవీ రమేష్ డీఈని ఆదేశించారు. డీఈ ఏడీతో కలిసి ఈ వ్యవహారంపై వివరాలు సేకరించినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే ఘటన ఎండీ వరకు వెళ్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, సస్పెన్షన్ ప్రమాదం లేకపోలేదని భావించిన లైన్‌మెన్ తరఫున యూనియన్ ప్రతినిధులు ఏఈపై ఒత్తిడి తెచ్చి ఫిర్యాదు వెనక్కి తీసుకునేలా రాజీ కుదిర్చినట్లు సమాచారం. ఎస్‌ఈ పీవీ రమేష్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఘటన జరిగినట్లు తెలిసిందని, విచారణ కోసం డీఈని ఆదేశించామని తెలిపారు.

తెరుచుకున్న సరళాసాగర్ సైఫన్ కవాటాలు

మదనాపురం, న్యూస్‌టుడే : మండలంలోని సరళాసాగర్ జలాశయానికి ఎగువ ప్రాంతంలో విస్తరించిన పెద్ద, బుర్ర వాగుల నుంచి వరద నీరు భారీగా రావడంతో ప్రాజెక్టుకు ఉన్న ఆటోమేటిక్ సైఫన్ల కవాటాలు తెరచుకున్నాయి. మంగళవారం సాయంత్రం ఒక ప్రైమింగ్, రెండు ఉడ్ సైఫన్ కవాటాలు తెరచుకుని నీటిని బయటకు విడుదల చేసింది. సుమారుగా 5 వేల క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తోందని ప్రాజెక్టు ఏఈఈ రణిల్‌రెడ్డి తెలిపారు. ఈ నీరంతా ఊకచెట్టు వాగు మీదుగా రామన్‌పాడ్ జలాశయానికి చేరుతున్నాయి.

చెంచు పెంటల్లో మౌలిక వసతులు


మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : చెంచు పెంటల్లో జీవనం సాగిస్తున్న ప్రజలకు మౌలిక వసతులు అందేలా చూడాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లో పీఎం జన్‌మన్ కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఇప్పటి వరకు చెంచు పెంటల్లో పూర్తయిన, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఉన్న 88 ఆదివాసి చెంచు పెంటల్లో ప్రధానమంత్రి జన్‌మన్ పథకాన్ని అమలు చేయాలన్నారు. 11 రకాల వసతులు తప్పనిసరిగా అందించాలని సూచించారు. వారం రోజుల్లో అందరికి ఆధార్‌కార్డులు అందించాలని ఆదేశించారు. మంజూరైన 890 ఇళ్లు, రహదారులు, తాగునీటి సరఫరా, మొబైల్ మెడికల్ యూనిట్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యుత్తు కనెక్షన్ల పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. చెంచు సభ్యుల జాబితా తయారు చేసి ఆయుష్మాన్ భారత్ కార్డులను ఇవ్వాలని తెలిపారు. అందరికి జన్‌ధన్ ఖాతాలను తెరిపించాలన్నారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్‌గోపిడి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్, డీఆర్‌డీఏ చిన్న ఓబులేష్, డీపీవో రామ్మోహన్‌రావు, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

కొండారెడ్డిపల్లిలో వేగంగా సౌర విద్యుత్తు పనులు

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో సౌర విద్యుత్తు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ నుంచి విద్యుత్తు శాఖ అధికారులతో కొండారెడ్డిపల్లి సౌర విద్యుత్తు పనులపై గూగుల్ సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ నుంచి విద్యుత్తు శాఖ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీతో కలిసి కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులతో సమీక్షించారు. సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ మాట్లాడుతూ.. ప్రభుత్వం సౌర విద్యుత్తును వినియోగించుకునే ప్రయత్నంలో భాగంగా పైలట్ ప్రాజెక్టు కింద కొండారెడ్డిపల్లిని ఎంపిక చేసిందన్నారు. త్వరలో కొండారెడ్డిపల్లిలో పర్యటించి పరిశీలిస్తానని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ కొండారెడ్డిపల్లిలో గృహ అవసరాలకు సంబంధించిన కనెక్షన్లు 499, వాణిజ్య 66, పరిశ్రమలు 10, వ్యవసాయ కనెక్షన్లు 867 ఉన్నట్లు తెలిపారు. వీటన్నింటికి కావాల్సిన విద్యుత్తు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయన్నారు. గ్రామంలో కుటుంబాల వారీగా పేర్ల నమోదు ప్రక్రియ మూడు రోజుల్లో పూర్తవుతుందని చెప్పారు. సౌర విద్యుత్తు పనులను వేగవంతంగా చేయాలన్నారు. సోలార్ ప్రాజెక్టుకు కావాల్సిన భూసేకరణ పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో గ్రామ అభివృద్ధి నోడల్ అధికారి డా. జీవీ రమేశ్, విద్యుత్తు శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈ, శ్రీధర్‌శెట్టి, డీపీవో రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యువజనోత్సవాలకు వేళాయే

నేటి నుంచి జిల్లా స్థాయి పోటీలు

అచ్చంపేట, రాజోలి, న్యూస్‌టుడే : యువతలోని సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహించేందుకు రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఏటా యువజనోత్సవాలను నిర్వహిస్తోంది. కలెక్టర్ల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వీటిని ఈనెల 25 నుంచి నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ అంశాల్లో పోటీలు ఉంటాయి.

జానపద నృత్యాలు : పోటీలు రెండు విభాగాల్లో నిర్వహించనున్నారు. ఒక విభాగంలో పదిమందితో కూడిన బృందం 15 నిమిషాలపాటు నృత్య ప్రదర్శన ఇవ్వాల్సి ఉంటుంది. రెండో విభాగంలో 7 నిమిషాల పాటు వ్యక్తిగత ప్రదర్శన ఉంటుంది. వ్యక్తిగత ప్రదర్శనలో గరిష్ఠంగా ఐదుగురు పాల్గొనవచ్చు. **జానపద గేయాలు :** బృందం, వ్యక్తిగత విభాగాల్లో పోటీలు ఉంటాయి. జానపద గేయాలను 7 నిమిషాల వ్యవధిలో పాడాల్సి ఉంటుంది. **కవిత్వం :** గంట సమయంలో 50 పదాల్లో కవితలు రాయాలి. **వ్యాసరచన :** ఎంపిక చేసిన అంశంపై గంట వ్యవధిలో వెయ్యి పదాల నిడివితో వ్యాసం రాయాలి. **పోస్టర్ తయారీ :** అధికారులు ఇచ్చిన ఇతివృత్తంపై 90 నిమిషాల్లో పోస్టర్ తయారు చేయాలి. **ఉపన్యాస పోటీలు :** లాటరీ ద్వారా ఎంపిక చేసిన అంశాన్ని అభ్యర్థులకు కేటాయిస్తారు. మూడు నిమిషాల్లో ఎంపిక చేసిన అంశంపై ఆంగ్లం లేదా హిందీలో మాట్లాడాలి. **విజ్ఞాన మేళా :** సైన్స్ మేళాను తొలిసారి నిర్వహిస్తున్నారు. సొంతంగా తయారు చేసిన ప్రాజెక్టులు, నమూనాలను ప్రదర్శిస్తారు.

హస్త కళల ప్రదర్శన : హస్త కళలు, దుస్తులు, వ్యవసాయ ఉత్పత్తులు తదితర అంశాలపై గరిష్ఠంగా ఇద్దరు ముఖాముఖిలో పాల్గొంటారు.

మూడు దశల్లో.. : పోటీలను మూడు దశల్లో నిర్వహిస్తారు. మొదటి దశ జిల్లా స్థాయిలో ఉంటాయి. ప్రతిభ చాటిన వారు రాష్ట్రస్థాయికి ఎంపికవుతారు. రెండో దశలో రాష్ట్రస్థాయి పోటీలను హైదరాబాద్‌లో నిర్వహిస్తారు. మూడో దశ పోటీలను స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా వచ్చే ఏడాది జనవరి 12-16వ తేదీ వరకు జాతీయస్థాయిలో నిర్వహించనున్నారు.


జానపద నృత్య ప్రదర్శన ఇస్తున్న బాలికలు

పోటీలు నిర్వహించే వేదికలు

జిల్లా	తేదీ	వేదిక
జోగులాంబ	28	ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల
నాగర్‌కర్నూల్	28	సాయి గార్డెన్ ఫంక్షన్ హాల్
నారాయణపేట	30	గ్రౌండ్ స్కూల్ స్టడీహాల్
వనపర్తి	26	ఇండోర్ స్టేడియం, వనపర్తి
మహబూబ్‌నగర్	25	డీఎస్ఏ మైదానంలోని ఇండోర్ స్టేడియం



దరఖాస్తుల ఆహ్వానం..

ఈనెల 28న జిల్లా కేంద్రంలో నిర్వహించే యువజనోత్సవాల్లో పాల్గొనేందుకు 15-29 ఏళ్ల వయస్సున్న వారు దరఖాస్తు చేసుకోవాలి. కలెక్టరేట్‌లోని జిల్లా యువజన, క్రీడలశాఖ కార్యాలయంలో దరఖాస్తుతో పాటు రెండు కలర్ ఫొటోలు, ఆధార్, వయసు ధ్రువీకరణ పత్రం జత చేసి అందజేయాలి.
- సీతారాం, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి, నాగర్‌కర్నూల్

తిరుమల పవిత్రతకు భంగం కలిగిస్తే చర్యలు: డీకే అరుణ

ఆత్మకూరు, న్యూస్‌టుడే : తిరుమల తిరుపతి పవిత్రతకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరుతున్నామని ఎంపీ డీకే అరుణ తెలిపారు. ఆత్మకూరు పట్టణంలో మంగళవారం భాజపా సభ్యత్వ కార్యశాల కార్యక్రమం అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వం తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో నాసిరకం, నెయ్యి వినియోగించినట్లు ధ్రువీకరణ పత్రాలు వెలువడిన నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, భక్తుల మనోభావాలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఈ అంశాన్ని తీవ్రంగా భావిస్తోందని చెప్పారు. హిందూ ధార్మికతను కాపాడే అంశంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందని చెప్పారు. ఆయా మతాల ధార్మిక, ఆధ్యాత్మిక అంశాలను రాజ్యాంగం పరిధిలో పరిరక్షించేందుకు కేంద్రం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని వివరించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, వనపర్తి జిల్లా అధ్యక్షుడు నారాయణ, మేర్వ రాజు, పుర ఫ్లోర్ లీడర్ అశ్విన్‌కుమార్, కౌన్సిలర్ మహేశ్వరి పాల్గొన్నారు.

29న ఎంవీఎస్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం

పాలమూరు, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ క్రిస్టియన్‌పల్లిలోని ప్రభుత్వ ఎంవీఎస్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఈ నెల 29న కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు సంఘం పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి కెఎస్ రవికుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా విద్యార్థులకు ఉన్నత విద్య అందించే ఆశయంతో 1965లో మహబూబ్‌నగర్ విద్యా సమితి(ఎంవీఎస్) పేరుతో పల్లెర్ల హనుమంతరావు, డీకే సత్యారెడ్డి, రాంచంద్రారెడ్డి, సత్తూరు రంగయ్య వంటి ప్రముఖులు కళాశాల స్థాపించారని, 2025 సంవత్సరంలో 60 ఏళ్లు అవుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని, దీనికి గవర్నర్‌తో పాటు ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కృష్ణారెడ్డి, రాజేంద్రకుమార్, రాజేంద్రప్రసాద్, చంద్రకుమార్ గౌడ్, వినోద్‌కుమార్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగి రిమాండ్

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : పట్టణంలోని ఎస్‌బీఐలో డబ్బులు స్వాహా చేసిన బ్యాంకు ఉద్యోగికి రిమాండ్ విధించినట్లు సీఐ రవీందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిందితుడు కిరణ్‌కుమార్ 2018 నుంచి 2023 వరకు బ్యాంకులోని ప్రజల ఖాతాల నుంచి రూ.1,49,50,000 తన భార్య ప్రశాంతితో పాటు మరికొందరి ఖాతాల్లోకి బదిలీ చేశాడు. గుర్తించిన శాఖ మేనేజర్ హుస్సేన్ బాషా ఇదివరకే ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిని మంగళవారం కోర్టులో హాజరు పర్చగా జడ్జి విజయ్‌కుమార్ రిమాండ్ విధించినట్లు తెలిపారు.

చెరువులో పడి కార్మికుడి గల్లంతు

జడ్చర్ల, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీ కార్మికుడు చెరువులో పడి గల్లంతైన ఘటన జడ్చర్ల మండలం గోప్లాపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ ఆదిరెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన తోకల జంగయ్య (65) పంచాయతీలో నీటిసరఫరా విధులు నిర్వహిస్తున్నారు. గ్రామ సమీపంలోని పెద్ద చెరువు లోపలికి వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. ఆచూకీ కోసం పోలీసులు, అగ్నిమాపకశాఖ అధికారులు గాలింపు చర్యలు చేపట్టినా రాత్రి వరకు ఆచూకీ లభించలేదని సీఐ తెలిపారు. తిరిగి ఉదయం గాలింపు చర్యలు చేపడతామని అన్నారు. సమాచారం తెలుసుకున్న మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ యాదయ్య, భారాస నాయకులు ఇంతియాజ్, గ్రామ నాయకులు అక్కడకు చేరుకున్నారు.

మండలానికి ఒకే విద్యాధికారి

76 మండలాల్లో బాధ్యతలు చేపట్టనున్న ఎంఈవోలు

పాలమూరు, అచ్చంపేట, నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : మండలానికి ఒకే విద్యాధికారి ఉండేలా ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మండల నోడల్ అధికారు(ఎంఎన్‌వో)లకే మండల విద్యాధికారులుగా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఇన్నాళ్లు ఒకే ఇన్‌ఛార్జి ఎంఈవోకు ఎక్కువ మండలాల బాధ్యతలు అప్పగించటంతో పర్యవేక్షణ కొరవడింది. ఈ సమస్యలను అధిగమించడానికి ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. కొంతకాలంగా ఉన్నత పాఠశాలల్లోని సీనియర్ జీహెచ్ఎంలు మండల నోడల్ అధికారు(ఎంఎన్‌వో)లుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇన్‌ఛార్జి ఎంఈవోలుగా మరికొందరు పనిచేస్తున్నారు. ఇక నుంచి ఒక్కరే ఉండనున్నారు. ఎంఎన్‌వో పోస్టు అనేది ఇక నుంచి ఉండదు. మండలానికి ఎంఈవో మాత్రమే ఉండనున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇద్దరే రెగ్యులర్ ఎంఈవోలుగా మహబూబ్‌నగర్ అర్బన్‌కు లక్ష్మణ్‌సింగ్, కల్వకుర్తికి శంకర్ ఉన్నారు. కొత్త నియమితులైన వారు 76 మండలాల్లో విద్యాధికారులు పాలన పగ్గాలు చేపట్టనున్నారు. పాఠశాలల పర్యవేక్షణ, తొలిమెట్టు, లిప్ కార్యక్రమాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, ఏకరూప దుస్తుల, పాఠ్య పుస్తకాల పంపిణీ, బిల్లుల చెల్లింపు తదితరాలన్నీ వారే నిర్వహిస్తారు. మహబూబ్‌నగర్ డీఈవో రవీందర్‌ని 'న్యూస్‌టుడే' సంప్రదించగా మండలంలో ఇక నుంచి ఎంఈవోనే విద్యకు సంబంధించిన అన్ని రకాల సేవలు అందిస్తారని, వ్యవస్థ గాడినపడుతుందని తెలిపారు.

మండలాల వారీగా ఎంఈవోలు వీరే

మహబూబ్‌నగర్ జిల్లా : కురుమూర్తి (అడ్డాకుల), శంకర్ (బాలానగర్), ఉషారాణి (భూత్పూర్), మురళీకృష్ణ (చిన్నచింతకుంట), బలరామ్ (దేవరకద్ర), జనార్దన్ (గండీడ్), గోపాల్‌నాయక్ (హన్వాడ), మంజుల (జడ్చర్ల), వెంకట్‌జీ (కోయిలకొండ), మంజులత (కౌకుంట్ల), కృష్ణయ్య (మహబూబ్‌నగర్ గ్రామీణం), రాజునాయక్ (ముమ్మదాబాద్), సుధాకర్ (మిడ్జిల్), ఎస్. రాజేశ్వర్‌రెడ్డి (మూసాపేట), నాగ్యానాయక్ (నవాబ్‌పేట), సుధాకర్ (రాజాపూర్).

జోగులాంబ గద్వాల జిల్లా : ఆర్.అశోక్‌కుమార్ (అలంపూర్), రవీంద్రాబాబు (ధరూర్), శ్రీనివాస్‌గౌడ్ (గద్వాల), నల్లారెడ్డి(గట్టు), డి.రాములు (అయిజ), జె.అమీర్‌పాషా (ఇటిక్యాల), కె. వెంకటేశ్వర్‌రావు (కేటీదొడ్డి), జి.సురేశ్ (మల్దకల్), బి.శివప్రసాద్ (మానవపాడు), భగీరథరెడ్డి (రాజోలి), రామకృష్ణ (ఉండవల్లి), బి. నర్సింహ (వడ్డేపల్లి), సి.వెంకటేశ్వర్లు (ఎర్రవల్లి).

నాగర్‌కర్నూల్ జిల్లా : పి.జీవన్‌కుమార్ (అచ్చంపేట), ఎ.బాలకృష్ణ (అమ్రాబాద్), వి.విష్ణుమూర్తి (బల్మూర్), ఎన్.రాములు (బిజినేపల్లి), ఆర్.ఝాన్సీరాణి (చారగొండ), ఎం.నిర్మల (కోడేరు), ఇమ్మాన్యుయేల్(కొల్లాపూర్), బషీర్ అహ్మద్ (లింగాల), కె.భాస్కర్‌రెడ్డి (నాగర్‌కర్నూల్), బుచ్చిబాబు (పదర), శ్రీనివాస్‌రెడ్డి (పెద్దకొత్తపల్లి), సి.కుర్మయ్య (పెంట్లవల్లి), జి.శ్రీనివాస్‌రెడ్డి (తాడూరు), సి.శ్రీనివాస్‌రెడ్డి (తెల్కపల్లి), సత్యనారాయణ (తిమ్మాజీపేట), చంద్రశేఖర్ (ఉప్పునుంతల), మురళీమోహన్ (ఉర్కొండ), మురళీ మనోహరాచారి (వంగూరు), ఎస్.చంద్రుడు (వెల్దండ).

నారాయణపేట జిల్లా : ఎస్.కృష్ణారెడ్డి (దామరగిద్ద), ఎం.గాయత్రి (ధన్వాడ), ఎం.శేఖర్‌రెడ్డి (గుండ్‌మాల్), శేఖర్‌నాయక్ (కోస్గి), ఆర్.ఆంజనేయులు (కొత్తపల్లి), నిజామొద్దీన్ (కృష్ణా), బాలకిష్టప్ప (మద్దూర్), మురళీధర్‌రెడ్డి (మాగనూరు), అనిల్‌గౌడ్ (మక్తల్), మనోరంజనీ (మరికల్), బాలాజీ (నారాయణపేట), ఎన్.రామకృష్ణ (నర్వ), కె.రాంచంద్రాచారి (ఉట్కూర్).

వనపర్తి జిల్లా.. : భాస్కర్‌సింగ్ (అమరచింత), బాలరాజు (ఆత్మకూర్), గణేశ్‌కుమార్ (చిన్నంబావి), పి.జయశంకర్ (ఘన్‌పూర్), కె.శ్రీనివాస్‌గౌడ్ (గోపాల్‌పేట్), జె.కృష్ణయ్య (కొత్తకోట), ఫరూఖ్ హుస్సేన్ (మదనాపూర్), శ్రీనివాసులు (పాన్‌గల్), ఎస్.జయరాములు (పెబ్బేరు), బి.విష్ణు (పెద్దమందడి), ప్రసాద్ (రేవల్లి), హన్మంతు (శ్రీరంగాపూర్), మద్దిలేటి (వనపర్తి), నర్సింహ (వీపనగండ్ల), జి.బుచ్చిరెడ్డి (ఎదుల్లా).



కోయిలకొండలోని మండల వనరుల కేంద్రం

చికెన్ ధరలు

ఫాంరేటు	125-00
రిటైల్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00



మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు
మహబూబ్‌నగర్: 9948145978 జడ్చర్ల: 8008573899
దేవరకద్ర: 9000031648 భూత్పూర్: 8008563143



సమస్య : ఏనుగొండ శ్రీరాం కాలనీలో మురుగు కాల్వల వ్యవస్థ సక్రమంగా లేక పోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీరంతా ఇళ్ల మధ్య నిలిచింది. దుర్వాసన రావడంతో పాటు దోమలు పెరిగాయి. నీరు నిల్వ ఉండకుండా శాశ్వత చర్యలు చేపట్టాలి. – సిద్ధు, శ్రీరాం కాలనీ

సమాధానం : కొన్ని వీధులకు మురుగు కాల్వలు ఉన్నాయి. అన్ని వీధులకు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుని వర్షపునీరు నిలవకుండా చూస్తాం. – హరిప్రసాద్, ఏఈ

సమస్య : ఏనుగొండ వివేకానంద కాలనీ ఒకటో వీధిలో కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. వాహనదారులు, పాదచారులు, చిన్నారులను వెంబడిస్తున్నాయి. కుక్కలను వీధి నుంచి దూరంగా తరలించాలి. – మహేందర్‌గౌడ్

సమాధానం : సమస్య పరిష్కారానికి కుక్కలను బంధించి సంతతి నియంత్రణ శస్త్రచికిత్సలు చేయిస్తాం. – రవీందర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

– న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం

తెరపై ఈనాడు

శ్రీనివాస - భలే ఉన్నాడే (ఉదయం ఆటలు), ఉత్సవం (రాత్రి ఆటలు), **బాలాజీ** - మత్తు వదలరా 2
తిరుమల - సరిపోదా శనివారం, **వేంకటేశ్వర** - గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (తెలుగు), **వెంకటాద్రి** - 35, **శ్రీకృష్ణ** - యుధ్ర (హిందీ) – న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం

జీవనం దుర్భరం



ఎడమ కాలు తొలగించిన చిన్న రాములు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : సెప్టిక్ వల్ల కాలు తొడ వరకు తీయడంతో కోయిలకొండ మండలం కొనాయపల్లికి చెందిన చిన్న రాములు జీవనం దుర్భరంగా మారింది. చిన్న రాములు నాలుగేళ్ల క్రితం వ్యవసాయ పనులు చేస్తుండగా కాలికి దెబ్బతగిలింది. నొప్పి ఎక్కువకు ఇంట్లో ఉన్న మందు రాయడంతో ఇన్ఫెక్షన్ పెరిగింది. మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించినా తగ్గలేదు. హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి వెళ్లగా కాలు కుళ్లిపోయిందని తొడ వరకు తొలగించారు. దాదాపు రూ.6లక్షల వరకు అప్పులు చేసి చికిత్స చేసినా పుండు మానకపోవడంతో కాలు తీసేయాల్సి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. అప్పటి నుంచి ఏ పనీ సొంతంగా చేసుకోలేకపోతున్నానని, ఎప్పుడూ ఒకరి తోడు ఉండాల్సిందేనని వాపోయారు. జీవనానికి ఆసరాగా దివ్యాంగుల పింఛను మంజూరు చేయాలని చిన్నరాములు అధికారులను వేడుకుంటున్నారు.

మానవీయం

ఆవరించిన అంధకారం



తల్లితో నందిని

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఆడుతూ పాడుతూ పాఠశాలకు వెళ్తున్న నందిని జీవితంలో ఒక్కసారిగా చీకట్లు కమ్ముకున్నాయి. మూసాపేట మండలం పోల్కంపల్లికి చెందిన వ్యవసాయ కూలీలు మల్లయ్య, మల్లమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో పెద్దమ్మాయి నందిని. రెండేళ్ల క్రితం గ్రామంలోని పాఠశాలలో 8వ తరగతి చదువుతుండగా విపరీతమైన తలనొప్పి వచ్చింది. ఆ తర్వాత క్రమంగా కంటిచూపు మందగించింది. తల్లిదండ్రులు రూ.9లక్షలు అప్పు చేసి మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లోని కంటి ఆస్పత్రుల్లో వైద్యం, శస్త్రచికిత్సలు చేయించినా ఆమెకు చూపు రాలేదు. ఇటీవలే ఆమెను మహబూబ్‌నగర్‌లోని అంధుల ఆశ్రమ పాఠశాలలో చేర్పించారు. చదువుకోవాలన్న తపనతో ఆమె రెండేళ్ల తర్వాత మళ్లీ పాఠశాలకు వెళ్తోంది. తమ కుమార్తెకు దివ్యాంగుల పింఛను, ఊళ్లో రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని తల్లి మల్లమ్మ కోరుతున్నారు.

ఆర్‌యూబీ ఏర్పాటు చేస్తాం: ఎంపీ



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ డీకే అరుణ

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే : దేవరకద్రలో అండర్‌పాస్ ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీ డీకే అరుణ అన్నారు. మంగళవారం అండర్‌పాస్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఎంపీ మాట్లాడుతూ.. అండర్‌పాస్ లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాలకు, ఆస్పత్రికి వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేంద్ర రైల్వేశాఖ మంత్రి, అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, కొండప్రశాంత్‌రెడ్డి, కృష్ణంరాజు, దేవన్న, నారాయణరెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

కాలనీలను ముంచెత్తిన వాగు



మడుగునగర్‌లో ఇళ్ల మధ్యకు వచ్చిన కొత్తచెరువు వాగునీరు



ఖలీల్‌చౌక్ ప్రాంతంలో ఇళ్ల మధ్య నుంచి పారుతున్న అలుగు నీరు

న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం : కొత్తచెరువు అలుగు పారడంతో వాగు పొంగి సమీప మడుగునగర్, పడాకులనగర్, ఖలీల్‌చౌక్, నూర్‌ఖాన్ రైస్‌మిల్ ప్రాంతాలను ముంచెత్తింది. కొత్తచెరువు మొదలు పాతతోట వరకు సుమారు 2 కి.మీ.ల పొడవునా వాగు అడుగడుగునా ఆక్రమణకు గురైంది. చాలా చోట్ల వాగు బఫర్‌జోన్ ఆక్రమించి ఇళ్లు నిర్మించారు. ఉన్నట్లుండి చెరువు అలుగు పారి ఉద్ధృతంగా వాగు ప్రవహించటంతో చాలా చోట్ల నీరు ఇళ్లు నిర్మించిన ప్రాంతాల్లోకి చేరింది. పరిస్థితి గమనించిన పురపాలిక అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, మార్కెట్ ఉపాధ్యక్షుడు విజయకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు హుటాహుటిన ముంపు ప్రాంతాలకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పొక్లెయిన్‌తో ఎక్కడికక్కడ కాలువలు తీసి నీరంతా వాగులోకి వెళ్లేలా చేశారు. అధికంగా ముంపునకు గురైన మడుగునగర్, ఖలీల్‌చౌక్ ప్రాంతాల్లో వాగు ఆక్రమణలు ఎక్కువగా ఉండటం గమనార్హం.

వరద బాధితులకు రెడ్‌క్రాస్ చేయూత

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఇటీవల వరదలకు అతలాకుతలమైన సూర్యాపేట వరద బాధితులకు సహాయార్థం జిల్లా, రాష్ట్ర రెడ్‌క్రాస్ సంస్థ చెరో రూ.2లక్షల చొప్పున రూ.4లక్షల వస్తు సామగ్రి పంపిణీకి తరలించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయేందిర బోయి వాహనాన్ని జెండా ఊపి సాగనంపారు. చీరలు, దుప్పట్లు, బకెట్లు, గిన్నెలు వస్తు సామగ్రిని పంపించారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం అందరి బాధ్యత కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు నటరాజ్, రాష్ట్ర సభ్యుడు రమణయ్య, కోశాధికారి జగపతిరావు, సభ్యుడు బాబుల్ రెడ్డి, మేనేజర్ నరసింహ, ఎన్టీఆర్ కళాశాల, ఎంవీఎస్ కళాశాల వాలంటీర్లు తదితరులున్నారు.

కలెక్టర్‌ను కలిసిన పీఆర్‌టీయూ కార్యవర్గం



కలెక్టర్ విజయేందిర బోయికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పీఆర్‌టీయూ జిల్లా నూతన అధ్యక్షుడు మదన్‌మోహన్ యాదవ్, ఇతర నాయకులు

పాలమూరు, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం కలెక్టర్ విజయేందిర బోయిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని ఐడీవోసీ కార్యాలయంలో కలెక్టర్‌ను సంఘం నూతన జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్ యాదవ్ ఆధ్వర్యంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు ఈఎల్స్‌ను మంజూరు చేయాలన్నారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఆశాస్త్రీయమైన హేతుబద్ధీకరణ ఉత్తర్వులను తరగతికి, సబ్జెక్ట్‌కి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఉత్తర్వులు ఉండేటట్లు సవరించాలని కలెక్టర్‌ను కోరారు. సంఘం నూతన ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, నాయకులు గట్టు వెంకట్‌రెడ్డి, గోపాల్‌నాయక్, తిమ్మారెడ్డి, బుచ్చారెడ్డి, సురేశ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ఆశ్వని చంద్రశేఖర్, అత్తర్ ఆహ్మద్ పాల్గొన్నారు.

వైద్యవిజ్ఞాన సదస్సుకు స్పందన



విద్యార్థులకు చెవి పనితీరు వివరిస్తున్న వైద్య విద్యార్థిని

పాలమూరు : మహబూబ్‌నగర్ పట్టణం ఏనుగొండ వద్ద ఉన్న ఎస్వీఎస్ వైద్య కళాశాలలో నిర్వహించిన వైద్య విజ్ఞాన సదస్సుకు విద్యార్థుల నుంచి చక్కని స్పందన వచ్చింది. ఈ నెల 24న సదస్సు ముగియాల్సి ఉండగా చాలా పాఠశాలలు, కళాశాలల కోరిక మేరకు మరో రెండు రోజుల పాటు కొనసాగించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.జోషి తెలిపారు. మంగళవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ విద్యాసంస్థల నుంచి వందలాది విద్యార్థులు ప్రదర్శన తిలకించడానికి వచ్చారు. మానవ శరీరంలోని గుండె, ఊపిరితిత్తులు, కన్ను, చెవి, గొంతు, నోరు, మూత్రపిండాలు, కాళ్లు, చేతులు, పేగులు, వెన్నుముక, కాలేయం, మెదడు ఇలా ప్రతి అవయవం పనితీరు, ప్రాధాన్యం వివరించేలా ఉపకరణాలు ఏర్పాటు చేశారు.

జైలులో వసతులు పరిశీలించిన న్యాయమూర్తి



ప్రధాన జైలులో వసతులను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని ప్రధాన జైలులో వసతులను సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర తనిఖీలు చేశారు. ఈ మేరకు మంగళవారం మహబూబ్‌నగర్ మొదట పట్టణ ఠాణా సమీపంలోని పాత పాలమూరులో ఉన్న జైలును సందర్శించి అక్కడ ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం కారాగారంలోని ఖైదీల బ్యారక్‌లు, వంటగది, డైనింగ్ హాల్, వారికి అందిస్తున్న భోజనం, నీటి వసతి, తదితర సౌకర్యాలను ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. వారి ఆరోగ్య సమస్యలపై ఆరాతీశారు. వారి కేసుల్లో న్యాయవాదులు ఉన్నారా లేరా అనే విషయాన్ని అడిగారు. ఒకవేళ మీ ఆర్థిక స్థోమత లేదంటే లోక్ అదాలత్ ద్వారా ఉచితంగా లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌ను నియమిస్తామని వారికి జడ్జి సూచించారు. కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ వెంకటేశం, జైలర్లు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా

రాజాపూర్: తడి, పొడి చెత్తను వేరు చేసి తమ ఇంటి వద్దకు వస్తున్న పంచాయతీ ట్రాక్టర్‌లో వేయాలని, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేస్తే జరిమానా విధిస్తామని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాజాపూర్ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి జ్ఞానేశ్వర్ స్వయంగా తయారు చేసిన గృహోపయోగ వస్తువులపై అవగాహన కల్పించే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అభినందించారు. ఎంపీడీవో మచ్చేందర్, ఎంపీవో వెంకట్రాములు, ఏపీవో భారతి, ఏపీఎం అనురాధ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

29న పాలమూరు సాహితి సభ

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ పట్టణంలో పాలమూరు సాహితి ఆధ్వర్యంలో ఈనెల 29న సాహిత్య సభను ఘనంగా నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా అధ్యక్షుడు డా.భీంపల్లి శ్రీకాంత్ వెల్లడించారు. తెలుగు సాహిత్యరంగంలో విశేష కృషి చేస్తున్న కవులకు పాలమూరు సాహితి పురస్కారం-2023 అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈసారి ప్రముఖ కవి డా.బాణాల శ్రీనివాసరావు రచించిన 'రాత్రి సింఫని' కవితా సంపుటి పురస్కారానికి ఎంపికైనట్లు వెల్లడించారు. మెట్టుగడ్డలోని కాళోజీ హాలులో ఈనెల 29న ఉదయం 10 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. కాళోజీ పురస్కార గ్రహీత కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి రచించిన 'హరిత స్వప్నం' పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

దేవాదాయ భూములు కబ్జా చేస్తే చర్యలు తప్పవు



ఆంజనేయస్వామి ఆలయం వద్ద గ్రామస్థులతో దేవాదాయశాఖ డిప్యూటీ కలెక్టర్ అనిత

కోయిలకొండ, న్యూస్‌టుడే: దేవాదాయ భూములు ఆక్రమిస్తే చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకుంటామని దేవాదాయశాఖ డిప్యూటీ కలెక్టర్ అనిత అన్నారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు మండలంలోని చిన్నలింగాల్‌చేడ్ గ్రామంలోని దేవాదాయ భూములను మంగళవారం ఆమె పరిశీలించారు. గ్రామ ఆంజనేయస్వామి దేవాలయానికి 72.09 ఎకరాల భూమి ఉండగా.. ఇందులో 22 ఎకరాలు కొందరు కౌలుకు తీసుకొని ఆలయ అభివృద్ధికి ఎలాంటి ఆదాయం ఇవ్వడంలేదన్నారు. ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. మొత్తం భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ రాజా గణేశ్‌కి సూచించామన్నారు. దేవాదాయ భూమిని వేలం వేసి ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామని ఆమె తెలిపారు. దేవాదాయశాఖ తహసీల్దార్ గిరిధర్, ఆర్ఐ వీణా, గ్రామస్థులు జేపాల్‌రెడ్డి, తిరుమలయ్య, కిష్టయ్య, వెకంటయ్య, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

విపణిలో హ్యూండయ్ అల్కాజర్ కారు



నూతన కారును ఆవిష్కరిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్‌లోని ట్రెండ్ కార్ల షోరూంలో హ్యూండయ్ అల్కాజర్ కారును డీఎస్పీ వెంకటేశ్వర్లు, షోరూం ఎండీ గట్టు గోపాల్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ 73 భద్రతా ప్రత్యేకతలు ఉన్న అల్కాజర్ కార్లు పెట్రోల్‌వి లీటరుకు 18.66 కి.మీ, డీజిల్‌వి 19.63కి.మీ మైలేజీ ఇస్తాయని తెలిపారు. మార్కెటింగ్ డైరెక్టర్ హర్షిత్‌రెడ్డి, యుక్త మోటార్స్ సీఈవో సిరిచందనరెడ్డి, సేల్స్ మేనేజర్ హర్షవర్ధన్ రెడ్డి, సర్వీస్ మేనేజర్ ఎండీ వసీమ్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరాంకు టీఎన్జీవో నేతల సత్కారం

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ ఉద్యోగుల ఐకాస విస్తృత స్థాయి సమావేశంలో జిల్లా టీఎన్జీవో నేతలు ఎమ్మెల్సీ కోదండరాంను మంగళవారం కలిసి సన్మానించారు. ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జిల్లా టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి చంద్రానాయక్, కోశాధికారి డా.కృష్ణమోహన్, అసోసియేట్ అధ్యక్షులు దివ్య, శ్యాంసుందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు యుగంధర్ నాయకుడు, సంయుక్త కార్యదర్శులు కృష్ణకాంత్, మధుసూదన్, సాయినాథ్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో పాలమూరుకు అగ్రస్థానమే లక్ష్యం



పిల్లలమర్రి సమీపంలో చెత్త ఊడుస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, పుర అధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే : స్వచ్ఛతలో పాలమూరు పురపాలికను అగ్రభాగాన నిలపటమే లక్ష్యమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పిల్లలమర్రిలో నిర్వహించిన శ్రమదానంలో ఆయన పాల్గొన్నారు. పురపాలక అధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, అటవీ శాఖ, మెప్మా సిబ్బందితో కలిసి పిల్లలమర్రి, పురావస్తు ప్రదర్శనశాల పరిసరాల్లో చీపుర్లతో చెత్త తొలగించారు. గురుకుల విద్యార్థులతో కలిసి పిల్లలమర్రి పరిసరాల్లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లాలో కొనసాగే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలన్నారు. పుర అధ్యక్షుడు మాట్లాడుతూ స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంధ సంస్థలు, సీనియర్ సిటిజన్లు, యువత భాగస్వాములు కావాలని కోరారు.

పాలమూరు, న్యూస్‌టుడే: పాలమూరు విశ్వవిద్యాలయంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పీయూలో స్వచ్ఛత, పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టారు. విద్యార్థులు, ఆధ్యాపకులు పీయూ ప్రాంగణంలో చెత్త సేకరించారు. ప్లాస్టిక్ రహిత పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ముందుకు సాగాలని ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డా. నూర్జహాన్ బేగం తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా.ప్రవీణ, చిన్నాదేవి, ఈశ్వర్‌కుమార్, చంద్రకిరణ్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికవ్వాలి

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీలకు ఉమ్మడి జిల్లా ఎంపికల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎదగాలని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి అన్నారు. మంగళవారం ఎండీసీఏ మైదానంలో అండర్-14 జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలను ప్రారంభించి మాట్లాడారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమానికి వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, అబ్దుల్లా, సీనియర్ క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుంచి 170 మంది బాలురు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ బాలికల జట్టుకు అభినందన



క్రీడాకారులతో డీవైఎస్‌వో ఎస్.శ్రీనివాస్, సాఫ్ట్‌బాల్ అధ్యక్షుడు అమరేందర్‌రాజు

మహబూబ్‌నగర్ క్రీడలు : రాజన్న సిరిసిల్లలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ టోర్నీలో ఉమ్మడి జిల్లా బాలికల జట్టు రజత పతకం అందుకుంది. మంగళవారం డీఎస్ఏ మైదానంలో పతకం సాధించిన క్రీడాకారులను డీవైఎస్‌వో ఎస్.శ్రీనివాస్, సాఫ్ట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రాజు, అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి శరత్‌చంద్ర, సంఘం సభ్యులు సాదిఖ్‌అలి, నాగరాజు, రాఘవేందర్, కపిల్, రూప అభినందించి సన్మానించారు.

రాష్ట్ర స్థాయి చిత్రలేఖన పోటీలకు విద్యార్థిని

అడ్డాకుల : అడ్డాకుల మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని అర్చన రాష్ట్ర స్థాయి చిత్రలేఖనానికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఆమె ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. మంగళవారం విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

గండీడ్, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సీఎంవో బాలుయాదవ్ అన్నారు. మంగళవారం గండీడ్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి కాంప్లెక్స్ సమావేశానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం గండీడ్ మండల కేంద్రంలో అద్దె భవనంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న కేజీబీవీ పాఠశాల తరగతి గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. వచ్చే వారం పాఠశాలను ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. జీహెచ్ఎం జనార్దన్, మాజీ ఎంపీటీసీ బాలయ్య, ప్రత్యేకాధికారి శివలీల తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ



విరాళాల సేకరణ ప్రారంభంలో జానపద కళాకారులు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఖమ్మం వరద బాధితుల సహాయార్థం జిల్లా జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణంలో ప్రారంభించారు. తెలంగాణ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టంకర శ్రీనివాస్, ఎదిర నర్సిములు మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పర్యటించి విరాళాలను సేకరించనున్నట్లు తెలిపారు. వచ్చిన విరాళాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ఖమ్మం వరద బాధితులకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాకారుల సంఘం నాయకులు యాదగిరి, శీనయ్య, జనార్ధన్, ఝాన్సీ, కవిత తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా వైద్య సేవలు..!



ఖాళీగా దర్శనమిస్తున్న వైద్యాధికారి కుర్చీ

మహమ్మదాబాద్, న్యూస్‌టుడే: పేదలకు సత్వర వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం మండల కేంద్రాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి వైద్యులను నియమించినప్పటికీ సేవలు మాత్రం నామమాత్రంగానే అందుతున్నాయని రోగులు అభిప్రాయ పడుతున్నారు. మహమ్మదాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటలకు వరకు పనివేళలు ఉండగా విధులు నిర్వర్తించే వైద్యుడు, సిబ్బంది చుట్టపు చూపుగా వచ్చివెళ్లడం నిత్యకృత్యంగా జరుగుతోంది. వైద్యుడు సమయపాలన లేకుండా వచ్చి వెళుతుంటారని అడిగితే పల్లె దవాఖానా, డీఎంహెచ్‌వో కార్యాలయానికి పనిమీద వెళ్లానని చెబుతున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. కొంతమంది సిబ్బంది సైతం యథారాజా తథాప్రజా అన్న చందంగా విధులకు రావడంలేదని.. వచ్చినా 2గంటలకే వెళ్లి పోతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. విషయం 'న్యూస్‌టుడే' దృష్టికి రావడంతో సోమ, మంగళవారం పీహెచ్‌సీ పరిశీలిన చేయగా.. వైద్యుడు డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమావేశం ఉందని వెళ్లారు. ల్యాబ్‌టెక్నీషియన్, పీహెచ్ఎన్ విధులకు రాలేదు, సూపర్‌వైజర్ మధ్యాహ్నమే వెళ్లిపోయారు. వైద్యాధికారి రహమత్‌తో మాట్లాడగా అందరూ విధులు సక్రమంగానే నిర్వహిస్తున్నారని ఆశాల జీతాలు ఆన్‌లైన్ చేసేందుకు జిల్లాకేంద్రం వెళ్లారని వెనకేసుకొచ్చే ప్రయత్నం చేశారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' డీఎంహెచ్‌వో పద్మను వివరణ కోరగా.. తనిఖీలు నిర్వహించి విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

స్థానిక సంస్థల్లో విజయానికి సభ్యత్వాలే కీలకం

భాజపా రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ అధ్యక్షుడు ధర్మారావు



సింహగిరిలో చిరు వ్యాపారికి సభ్యత్వం అందజేస్తున్న ధర్మారావు, చిత్రంలో భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాజపా విజయానికి పార్టీ సభ్యత్వాలే కీలకమని మాజీ ఎమ్మెల్యే, భాజపా రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ అధ్యక్షుడు ధర్మారావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మహబూబ్‌నగర్ పట్టణంలోని సింహగిరి, సంజయ్‌నగర్ ప్రాంతాల్లో భాజపా డిజిటల్ సభ్యత్వాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు భిన్నంగా ఉంటాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో భాజపాకు ఆశించిన స్థాయిలో ఓట్లు రాలేదని, లోక్‌సభ ఎన్నికలు వచ్చే సరికి ఊహించని రీతిలో ఆదరణ లభించిందన్నారు. అలాగని స్థానిక సంస్థల ఎన్నికల్లో భాజపాకు భారీగా ఓట్లు పడతాయని భావించడం సరికాదని, ఇందుకోసం పెద్దఎత్తున సభ్యత్వాలు చేయించటంతో పాటు ప్రజలను భాజపాలో భాగస్వాములను చేయడమే ముఖ్యమని శ్రేణులకు సూచించారు. భాజపా అభిమానులు, యువత, మహిళలు, వ్యాపారులు, ఉద్యోగులను కులమతాలకు అతీతంగా గుర్తించి వారి ఇళ్లకు వెళ్లి పార్టీ సభ్యత్వాలు అందజేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి, పడాకుల బాలరాజు, పార్లమెంట్ అధికార ప్రతినిధి కె.రాములు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నేతలు అంజయ్య, పిట్టల యాదయ్య, నాయకులు కృష్ణవర్ధన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

నవాబ్‌పేట,న్యూస్‌టుడే : చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన నవాబుపేట మండల పరిధిలోని గురుకుంట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై విక్రమ్ వివరాల మేరకు.. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం తంగెల్లపల్లి గ్రామానికి చెందిన చెక్కల ఆంజనేయులు(35), ఇదే గ్రామానికి చెందిన కమ్మరి బ్రహ్మయ్యతో కలిసి గురుకుంట గ్రామ శివారులోని మేకలకుంట దగ్గర చేపలు పట్టేందుకు సోమవారం వెళ్లారు. ఆంజనేయులు చేపలు పట్టేందుకు కుంటలో దిగి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. విషయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు తెలిపి కుంటలో వెతకగా మంగళవారం శవం లభించినట్లు తెలిపారు. మృతుని భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ద్విచక్రవాహనం చోరీ కేసు నమోదు

మిడ్జిల్, న్యూస్‌టుడే : మండల కేంద్రానికి చెందిన పెంటయ్య ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. ఇంట్లో అద్దెకు ఉన్న వ్యక్తి మంగళవారం ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నట్లు పోలీసులు చెప్పారు.

చరవాణి చోరీ.. రూ.2లక్షలు ఖాళీ..!

ఫిర్యాదుతో తిరిగి ఖాతాలోకి డబ్బులు

జడ్చర్ల, న్యూస్‌టుడే : బస్సులో వెళ్తుండగా చరవాణి చోరీ చేయడంతో పాటు, ఫోన్‌లోని బ్యాంకు ఖాతాల యాప్‌ల ద్వారా రూ.2లక్షల వరకు ఖాళీ చేసిన ఘటన గత శుక్రవారం చోటుచేసుకోగా సకాలంలో పోలీసులు స్పందించి ఖాతాను సీజ్ చేయడంతో డబ్బులు తిరిగి ఖాతాలోకి వచ్చాయి. జడ్చర్ల పురపాలికలోని కావేరమ్మపేటలో నివాసం ఉండే టీవీ మెకానిక్ జిలానీ వివరాల ప్రకారం.. బంధువు మృతి చెందడంతో శుక్రవారం హైదరాబాద్ బయలుదేరేందుకు జడ్చర్లలో బస్సు ఎక్కిన బాధితుడు అనంతరం జేబులు చూసుకోగా ఫోన్ చోరీకి గురైనట్టు గుర్తించారు. అనంతరం బ్యాంకు ఖాతాలో డబ్బులు పరిశీలించగా రూ.2లక్షల వరకు ఇతర ఖాతాలోకి బదిలీ అయినట్లు తెలుసుకున్నారు. ఈ విషయంపై బాధితుడు జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఆదిరెడ్డికి ఫిర్యాదు చేయగా సైబర్ క్రైం కేసు నమోదు చేశారు. సకాలంలో స్పందించడంతో బ్యాంకు ఖాతాను జప్తు చేసి మంగళవారం తిరిగి డబ్బులను రికవరి చేసినట్టు పోలీసులు సమాచారం ఇచ్చారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

రాజాపూర్, న్యూస్‌టుడే: మండలంలోని రంగారెడ్డిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సురక్ష పోలీసు కళాబృందం, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, షీ టీం సభ్యులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గోడ పత్రికలు విడుదల చేశారు. కళాబృందం సభ్యులు పాటలు, మాటల ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఆనంద్, గౌస్, కళా బృందం సభ్యులు రాములు, జగదీశ్, శ్రీనివాస్, శివరాములు, షీటీం సభ్యులు రఘుకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఫుట్‌బాల్ జట్లు ఎంపిక

జడ్చర్ల : జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14, 17 బాల, బాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక జడ్చర్లలో మంగళవారం చేపట్టారు. బాదేపల్లి జడ్పీహెచ్ఎస్ సిగ్నల్‌గడ్డ పాఠశాలలో చేపట్టిన ఎంపికల్లో మొత్తం 1076 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈనెల 27న గద్వాల జిల్లాలో జరిగే ఉమ్మడి జిల్లా అండర్-17 క్రీడలకు మహబూబ్‌నగర్ జిల్లా జట్టును ఎంపిక చేసినట్టు టోర్నమెంట్ కన్వీనర్ వడ్డన్న తెలిపారు. కార్యక్రమాల్లో మండల విద్యాధికారి మంజుల, ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, అనంతప్ప, శ్రీనివాసులు, లక్ష్మీదేవి, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భానుకిరణ్, కృష్ణయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.